సాక్షి
వికారాబాద్
బుధవారం ၊ 4 ၊ డిసెంబర్ ၊ 2024






## మారని తండ్లాట!

జిల్లాలో వాహనరాకపోకలు లేని ఏకైక తండా.. తరాలు మారుతున్న.. తండాకు మాత్రం రోడ్డు సౌకర్యం లేదు. 8లో▸



## తవ్వకాలపై విచారణ

ఎర్రమట్టి అక్రమ తవ్వకాలపై నల్లగొండ అడిషనల్ ఎస్పీ రాములునాయక్ విచారణ చేపట్టారు. 8లో▸



## నాణ్యతకు పెద్దపీట

పాఠశాలల్లో నాసిరకం భోజనానికి చెక్ పెట్టేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. 9లో▸

## న్యూస్‌రీల్

### ఉద్యమ నాయకులకు ఊరట

అనంతగిరి: వికారాబాద్ ప్రత్యేక జిల్లా కోసం జరిగిన ఉద్యమంలో ధారూర్ మండలం కెరెళ్లి వాసులపై పెట్టిన కేసుల విషయంలో మంగళవారం వికారాబాద్ అదనపు మొదటి తరగతి న్యాయస్థానంలో ఊరట లభించిందని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఉద్యమకారుడు ఆనంద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంతో పాటు జిల్లా సాధన ఉద్యమంలో కెరెళ్లి వాసులు ముఖ్య పాత్ర పోషించారన్నారు. కేసులో కెరెళ్లి వాసులైన జలంధర్‌రెడ్డి, ఆనంద్, బల్వంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మెతుకు కిష్టయ్య( చనిపోయారు), కావలి వెంకటయ్యలకు ఊరట లభించిందని ఆయన తెలిపారు.

### రేపు డీఈఈ సెట్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్

అనంతగిరి: ఉమ్మడి రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డీఈఈ సెట్ 2024–26లో కోర్సులో చేరే అభ్యర్థులకు గురువారం రెండో విడత సర్టిఫికెట్స్ వేరిఫికేషన్ ఉంటుందని వికారాబాద్ ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామాచారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7 నుంచి 9వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని సూచించారు. 13న సీట్లు కేటాయింపు, 17లోగా ఫీజు చెల్లించి అలాట్మెంట్ లెటర్‌తో సీటు వచ్చిన కళాశాలలో ఒరిజినల్ ధృవపత్రాలను సమర్పించాలన్నారు. కళాశాల బదిలీ కొరకు 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చన్నారు.

### ‘లగచర్ల’ బెయిల్ పిటిషన్ల తిరస్కరణ

- నిరాశలో బీఆర్‌ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు
- నేడు నాంపల్లి ప్రత్యేక కోర్టుకు..?

వికారాబాద్: లగచర్ల ఘటనకు సంబంధించి రెండు బెయిల్ పిటిషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ప్రభుత్వ ఆస్తుల ధ్వంసానికి సంబంధించి కేసులు నమోదైతే అవి ప్రత్యేక కోర్టులో మాత్రమే విచారించాలని 2024 మే నెలలో హైకోర్టు ఇచ్చిన ఉత్వర్వులను అనుసరించి వికారాబాద్ జిల్లా కోర్టు ఈ పిటిషన్లను తిరస్కరించింది. నవంబర్ 11న అధికారులపై దాడి ఘటనలో 12వ తేదీ నుంచి వారం రోజుల పాటు మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డితో పాటుగా కేసులో ఉన్న పలువురిని రిమాండ్‌కు తరలించిన విషయం విధితమే. ఇందుకు సంబంధించి 20 రోజులుగా బీఆర్‌ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు వికారాబాద్ జిల్లా కోర్టులో రెండు బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. పీపీ, నిందితుల తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ రాగా పలు దఫాలుగా వాయిదా పడుతూ వచ్చింది. నరేందర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై ఈ నెల 5న వాదనలు జరగాల్సి ఉంది. మంగళవారం రైతులకు బెయిల్ పిటిషన్‌కు సంబంధించి వాదనలు విన్న కోర్టు రెండు పిటిషన్లను తిరస్కరించింది. వారి బెయిల్ కో సం బుధవారం న్యాయవాదులు నాంపల్లి ప్రత్యేక కోర్టును ఆశ్రయించనున్నట్లు సమాచారం.

### సీఎం చొరవతోనే ఫోర్‌వే

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: గత ప్రభుత్వ హయాంలో జిల్లాకు తీరని అన్యాయం చేశారని.. ప్రాణహిత చేవెళ్లను పక్కదారి పట్టించారని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిధిలోని మన్నెగూడలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ముది రాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీఆర్‌ఆర్ మాట్లాడుతూ.. పదేళ్ల అధికారంలో ఉన్న కేసీఆర్, జిల్లా మంత్రులు అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లేన్ల రోడ్డు వేయలేకపోయారన్నారు. గ్రీన్ ట్రిబ్యునల్ ఎన్‌జీటీలు చెట్లు నరకొద్దంటూ కేసులు పెట్టినా.. ప్రజల ప్రాణాలే ముఖ్య మని సీఎం రేవంత్‌రెడ్డి రోడ్డు పనుల ప్రారంభించాలని చెప్పారన్నారు. ఆయన చొరవతోనే ఫోర్‌వే పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. నవంబర్ 28 నుంచి రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతుంటే బీఆర్‌ఎస్ నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. వికారాబాద్‌లో నేవీ రాడార్,వికారాబాద్ క్రిష్ణా రైల్వే లైన్ ఏర్పాటుకు తమ ప్రభుత్వమే శ్రీకారం చుట్టిందని తెలిపారు. రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం రూ.135కోట్లు చెల్లించిందన్నారు. జిల్లాకు ఏం చేశారని ప్రశ్నిస్తున్న నాయకులు పదేళ్ల కాలంలో ఏం చేశారో చెప్పాలన్నారు. రా ష్ట్రానికే గుండెకాయలా ఉన్న రంగారెడ్డి జిల్లా ను ముక్కలుగా చేశారన్నారు. ప్రాణహిత చేవె ళ్ల ప్రాజెక్టును రీడిజైన్ పేరిట కొండ పోచమ్మ రిజర్వాయర్‌కు మళ్లించి జిల్లా ప్రజలకు అన్యాయం చేశారన్నారు. ఈ సందర్భంగా ఆలూరు గేటు వద్ద జరిగిన ప్రమాద మృతులకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పట్లోళ్ల సతీశ్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు షకీల్, పెంటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, లాల్‌కృష్ణ ప్రసాద్, అజీంపటేల్, శ్రీని వాస్, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి నిధుల వరద

## ఏడాదిలో నియోజకవర్గానికి రూ.650 కోట్లు

- ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ.350 కోట్లు
- ముఖ్యమంత్రి సహకారంతో ముందుకు వెళ్తున్నాం
- విద్య, వైద్య రంగాలపై ప్రత్యేకంగా దృష్టి
- రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తే ఎమ్మెల్యేగా సక్సెస్ అయినట్లే
- ‘సాక్షి’తో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



‘ప్రభుత్వం నుంచి అభివృద్ధి పనులకు నిధులు తీసుకురావడంలో తాండూరు అసెంబ్లీ నియోజకవర్గం రాష్ట్రంలోనే 5వ స్థానంలో నిలిచింది.. నియోజకవర్గ అభివృద్ధి .. పారిశ్రామికవాడ నెలకొల్పడమే లక్ష్యం అంటున్నారు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి (బీఎంఆర్). రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన నేపథ్యంలో.. చేపట్టిన పనులు.. భవిష్యత్తు ఆలోచనలను ‘సాక్షి’తో పంచుకున్నారు.

– తాండూరు

**ప్రశ్న:** నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటి వరకు ఎంత మేర నిధులు వచ్చాయి?

**జవాబు:** ఏడాది కాలంలో కొత్తగా రూ.650 కోట్ల నిధులను తీసుకొచ్చా. గత ప్రభుత్వం జీవోలు కాగితాలకే పరిమితమయ్యాయి. తాను ఎమ్మెల్యేగా నిధులు మంజూరు, అడ్మినిస్ట్రేషన్, టెండర్లు పూర్తి చేయించాం.

**ప్రశ్న:** రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు ఏమైనా చేపట్టారా?

**జవాబు:** దశాబ్దకాలంగా రోడ్లన్నీ పాడయ్యాయి. తాండూరు–హైదరాబాద్ మార్గం గుంతలమయంగా ఉంటే ఇప్పటికే అవి లేకుండా చేశాం. నాలుగు లైన్ల విస్తరణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో రూ.120 కోట్లు మంజూరు చేయించాం. నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్లకు మరో రూ.వంద కోట్లు మంజూరయ్యాయి. తాండూరు–చించోళి రోడ్డు విస్తరణకు రూ.25కోట్లు మంజూరయ్యాయి. నియోజకవర్గ పరిధిలో రోడ్ల అభివృద్ధికి ఇప్పటి వరకు రూ.350కోట్ల వరకు టెండర్లు పూర్తయ్యాయి.

**ప్రశ్న:** చిలుక వాగు ప్రక్షాళన ఎంతవరకు జరిగింది?

**జవాబు:** రూ.పది కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇటీవలే ఇద్దరు మంత్రులు పనులకు శంకుస్థాపన చేశారు.

**ప్రశ్న:** గొల్ల చెరువును అభివృద్ధి చేస్తారా?

**జవాబు:** గత ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి అసంపూర్తిగా పనులు వదిలేశారు. చెరువు అభివృద్ధికి రూ.4కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నాం.

**ప్రశ్న:** పాత తాండూరు రైల్వే బ్రిడ్జి నిర్మాణం ఎంత వరకు వచ్చింది?

**జవాబు:** రైల్వే శాఖ మంత్రిని పనులు సాగించేందుకు అనుమతులు పొందాం. మార్చిలో పనులు ప్రారంభించాం. రోడ్డు పక్కన ఇళ్లు ఉన్న ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించి పనులు ప్రారంభిస్తాం.

**ప్రశ్న:** బైపాస్ రోడ్డు ఎన్నికల హామీలకే పరిమితమా?

**జవాబు:** ప్రసాద్‌కుమార్ మంత్రిగా ఉన్న సమయంలో తాండూరు బైపాస్ రోడ్డు మంజూరయింది. తర్వాత బీఆర్‌ఎస్ పదేళ్ల పాలించి విఫలమైంది. ప్రస్తుతం భూ సేకరణకు వచ్చిన అవాంతరాలను కొలిక్కి తీసుకువచ్చి వేగం పెంచాం.

**ప్రశ్న:** కంది బోర్డు ఏర్పాటు ఎప్పుడు?

**జవాబు:** ముఖ్యమంత్రి కంది బోర్డు ఏర్పాటుకు సానుకూలంగా ఉన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే కేంద్రం ప్రభుత్వ ప్రతినిధులను కలిసి బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతాం.

**ప్రశ్న:** లారీ పార్కింగ్ లేక ఇబ్బందులు ఎదురు అవుతున్నాయి కదా?

**జవాబు:** లారీ పార్కింగ్ ఏర్పాటుకు ఇప్పటికే ట్రాన్స్‌పోర్ట్ అసోషియేషన్ ప్రతినిధులతో చర్చించాం. స్థల సేకరణ పూర్తయింది. లారీ పార్కింగ్ ప్రాంగణ అభివృద్ధిని టీఎస్ఐఐసీ అభివృద్ధి చేయనుంది. ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకులకు షాపులను కేటాయించేందుకు ఒక్కో దుకాణానికి రూ.12 లక్షలు చెల్లించాలని టీఎస్ఐఐసీ నిర్ణయించింది. త్వరలోనే పనులకు శ్రీకారం చుడతాం.

**ప్రశ్న:** పారిశ్రామిక వాడ ఏర్పాటు చేయాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది?

**జవాబు:** ఏడాది కాలంలో పట్టణంలో నాపరాతి పాలిషింగ్ యూనిట్‌లను పారిశ్రామిక వాడలోకి తరలించేలా కృషి చేస్తాను.

**ప్రశ్న:** బషీరాబాద్ మండలంలో ఎత్తిపోతల పథకాలను అందుబాటులోకి తీసుకొస్తారా?

**జవాబు:** ఎత్తిపోతల పథకాల ద్వారా సాగు నీరు అందించేందుకు టీఎస్ఐడీసీ అధికారులతో సర్వే చేయించాం. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం.

**ప్రశ్న:** కోట్‌పల్లి, జుంటిపల్లి ప్రాజెక్టుల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయా?

**జవాబు:** కోట్‌పల్లి ప్రాజెక్టు అభివృద్ధికి నీటిపారుదల శాఖ అధికారులతో నిధుల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయించి ప్రభుత్వానికి సమర్పించాం. ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నిధులు మంజూరు చేయనున్నారు. మరోవైపు జుంటిపల్లి ప్రాజెక్టు కెనాల్ కాల్వలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. నాలుగు నెలల క్రితం రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు జుంటిపల్లి ప్రాజెక్టు సందర్శించారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి. యాలాల మండలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన శివసాగర్ ప్రాజెక్టు పనులను సైతం పూర్తి చేస్తాం.

**ప్రశ్న:** ప్రజారోగ్యంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

**జవాబు:** పారిశుద్ధ్య నిర్వాహణ సక్రమంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించాం. తాండూరులో ఉన్న ప్రభుత్వ జిల్లా ఆస్పత్రితో పాటు మాతా శిశు ఆస్పత్రిలో ప్రజలకు వైద్య సేవలు అందేలా పటిష్టమైన చర్యలు తీసుకున్నాం. బషీరాబాద్ మండల ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులతో పాటు 24 మంది స్టాఫ్‌నర్స్‌లను నియమించాం.

**ప్రశ్న:** కర్ణాటక సరిహద్దులో రవాణా వ్యవస్థతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అటవీ భూ వివాదం పరిష్కారంపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

**జవాబు:** అంతరాష్ట్ర సరిహద్దులో రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రణాళిక తయారు చేశాం. వారం క్రితమే కర్ణాటక రాష్ట్ర మంత్రి శరణుప్రకాష్‌పాటిల్‌తో కలిసి ఇరు రాష్ట్రాల సరిహద్దులో రవాణా వ్యవస్థను మెరుగుపర్చేందుకు సయోధ్య కుదిరింది. నవాంద్గి నుంచి నిడుగుంద వరకు రోడ్డు పనులు ప్రారంభించాం. ఇందర్‌చెడ్–కురుగుంట, మైల్వార్–అడ్కి మార్గాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తాం.

**ప్రశ్న:** నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని నిధులు మంజూరయ్యాయి?

**జవాబు:** రూ.650 కోట్ల వరకు నిధులు తీసుకువచ్చాం.

**ప్రశ్న:** తాండూరు వ్యవసాయ నూతన మార్కెట్ యార్డు ఎప్పటి వరకు అందుబాటులోకి తీసుకొస్తారు..

**జవాబు:** వ్యవసాయ మార్కెట్ యార్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఏడాదిలో పనులు పూర్తి చేసి వ్యాపారులకు, రైతులకు అందుబాటులోకి తీసుకొస్తాం. నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి.

**ప్రశ్న:** విద్యావ్యవస్థ పటిష్టానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

**జవాబు:** ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థులను గుణాత్మకమైన విద్య అందించేందుకు అంకిత భావంతో కృషి చేస్తున్నాం. ఈ విద్యాసంవత్సరం నుంచి ఐటీఐ కళాశాల ప్రారంభిస్తాం.

**ప్రశ్న:** ఏడాది పదవీ కాలంలో సంతృప్తినిచ్చిన అంశం?

**జవాబు:** తాండూరు–హైదరాబాద్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం.

**ప్రశ్న:** పార్టీలో ప్రాధాన్యత లేదనే విమర్శలు వస్తున్నాయి?

**జవాబు:** పార్టీలో అందరికి సమ ప్రాధాన్యతనిస్తూ ముందుకు వెళుతున్నాం. పార్టీ కోసం పని చేసిన వారికి తప్పక ప్రాధాన్యత ఉంటుంది.



జెండా ఊపి 2కే రన్ ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ మంజుల, చిత్రంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, జిల్లా అధికారులు

# ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా 2కే రన్‌లో పాల్గొన్న జిల్లా స్థాయి అధికారులు

అనంతగిరి: ప్రతీ ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎన్నేపల్లి చౌరస్తా నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు 2కే–రన్ ఏర్పాటు చేశారు. ఈ రన్‌ను కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్‌లు లింగ్యానాయక్, సుధీర్ మున్సిపల్ చైర్మన్ మంజుల ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. విజయోత్సవాల్లో ప్రతీ ఒక్కరు భాగస్వాములై కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ప్రతీ ఒక్కరు రోజు వ్యాయామం చేయాలని సూచించారు. ఈ రన్‌లో డీఆర్‌డీఏ శ్రీనివాస్, డీవైఎస్‌ఓ హనుమంత రావు, డీటీడీఓ కమలాకర్ రెడ్డి ,మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

**నాణ్యత తప్పనిసరి**

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేపడుతున్న పనుల్లో నాణ్యత తప్పక పాటించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. వికారాబాద్‌లోని రాజీవ్‌నగర్ కాలనీ సమీపంలో నిర్మించిన ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రారంభం చేయనున్న క్రమంలో కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి జనరల్ వార్డులు, ఆపరేషన్ థియేటర్, ఐసీయూ గదులను పరిశీలించారు. అనంతరం అనంతగిరిగుట్టలో నిర్మించిన సమీకృత ఆయుష్ వైద్యశాలను పరిశీలించారు. వైద్యశాల ఆవరణలో సీసీ రోడ్డు నిర్మాణానికి అంచనాలను సమర్పించాలని టీజీఎంఐడీసీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీనారాయణను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్‌ఓ వెంకటరవణ, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రాంచంద్రయ్య, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్, ఉన్నారు.

**పనుల్లో వేగం పెంచాలి**

కొడంగల్: కొడంగల్‌లో ఏర్పాటు చేసిన నర్సింగ్ కళాశాల కోసం నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. మంగళవారం ఆయన పట్టణంలోని సమీకృత బాలికల వసతిగృహ సముదాయం ఆవరణలో తాత్కాలికంగా నిర్వహించే నర్సింగ్ కళాశాల భవనాన్ని పరిశీలించారు. మౌలిక వసతుల ఏర్పాటుతో పాలుగా కావాల్సిన మరమ్మతులు చేపట్టాలన్నారు. అనంతరం పట్టణంలో నిర్మిస్తున్న సెంట్రలైజ్‌డ్ కిచెన్ షెడ్‌ను పరిశీలించారు. హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం అందించే వంటశాలను కలెక్టర్ సందర్శించారు. కొడంగల్ నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లోని 312 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉదయం పూట ఉచితంగా నాణ్యమైన అల్పాహారం అందించనున్నారు. త్వరలో కిచెన్ షెడ్ ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ వెంట తాండూరు సబ్–కలెక్టర్ ఉమా శంకర ప్రసాద్, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ ఉషశ్రీ, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లిల్లీ మేరీ, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, డీఈ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ‘పది’పై ప్రత్యేకంగా దృష్టి

**డీఈఓ రేణుకాదేవి**

తాండూరు రూరల్: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. మంగళవారం ఆమె మండల పరిధిలోని చెంగోల్ జెడ్పీహెచ్‌ఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యత పాటించని ఏజెన్సీలపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. పదోతరగతి విద్యార్థులను ప్రశ్నించి సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయ బృందంతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆమె వెంట హెచ్‌ఎం పరాశ్యనాయక్ ఉన్నారు.

**‘ఎన్‌ఏఎస్’ నిర్వహణపై శిక్షణ**

మండల పరిధిలోని రాంపూర్ గేటు సమీపంలోని



చెంగోల్ పాఠశాలలో విద్యార్థిని సామర్థ్యాలు పరీక్షిస్తున్న డీఈఓ రేణుకాదేవి

ఇంటర్నేషనల్ పాఠశాలలో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(ఎన్‌ఏఎస్) పరీక్ష నిర్వహణపై డీఈఓ ఇన్విజిలేటర్లతో సమావేశమయ్యారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యంపై 3, 6, 9వ తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

# ‘ఆధారం’ లేదని వైద్యం నిరాకరణ!

**మానవత్వం మరిచిన జిల్లా ఆస్పత్రి వర్గాలు**

- 25 రోజులుగా దవాఖానా ఎదుట పడిగాపులు కాస్తున్న అభాగ్యుడు
- కాలికి ఇన్‌ఫెక్షన్ సోకి పురుగులు పట్టిన వైనం

తాండూరు టౌన్: ఆధార్ కార్డు లేదు.. ఆస్పత్రిలో చేర్చుకుంటే నిన్ను చూసుకునే వారు లేరు అని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వర్గాలు ఓ వ్యక్తికి వైద్యం నిరాకరించాయి. దీంతో ఓ అభాగ్యుడు 25 రోజులుగా దవాఖానా ఎదుట పడిగాపులు పడుతూ సాయం ఎదురు చూస్తున్నాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో.. మానవత్వం మరిచిన ఆస్పత్రి వర్గాలపై స్థానికులు మండిపడుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కర్నాటక రాష్ట్రం చించోళి ప్రాంతానికి చెందిన శివకుమార్ తాండూరులో ఒంటరిగా ఉంటూ కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతని ఎడమ కాలికి దురద పెట్టడంతో చేతితో గోకాడు. దీంతో చీము, నెత్తురు కారడం మొదలైంది. చికిత్స నిమిత్తం 25 రోజుల క్రితం జిల్లా ఆస్పత్రికి వెళ్లగా ఆధార్ కార్డు లేదని,



తాండూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి బయట వైద్యం కోసం ఎదురు చూస్తున్న శివకుమార్

ఆస్పత్రిలో చేర్చుకుంటే బాగోగులు ఎవరు చూస్తారని..? నిరాకరించారు. కదలలేని స్థితిలో ఉన్న శివకుమార్ అక్కడక్కడే గడుపుతున్నాడు. పలుమార్లు ఆస్పత్రి సిబ్బందిని వేడుకున్నా.. అతన్ని లోపలికి అనుమతించలేదు. దీంతో పురుగులు పడి కాలు కొట్టేసే పరిస్థితికి చేరుకుంది. అతని దీనస్థితిని చూసిన పలువురు స్థానికులు ఆస్పత్రి వర్గాలకు మొరపెట్టినా కనికరించలేదు. పైగా అతన్ని ఆస్పత్రిలో చేర్చుకుంటే నీవు వెంట ఉంటావా..? అని ఎదురు ప్రశ్నించారని పలువురు ఆరోపించారు. అయితే తాను అతనికి తోడుగా ఉంటానని చెప్పినా కూడా పట్టించుకోలేదని ఓ స్థానికుడు అసహనం వ్యక్తంచేశాడు.

# ప్రాణాలు పోతున్నా పట్టదా?

- ఇంకెంత కాలం నిర్లక్ష్యం
- వెంటనే రోడ్డు విస్తరణ చేపట్టండి
- అఖిలపక్షం నాయకుల డిమాండ్
- హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై ధర్నా

చేవెళ్ల: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టేందుకు కాలయాపన చేస్తుండడంతో ప్రజల ప్రాణాలు పోతున్నాయని అఖిలపక్షం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు చేవెళ్లలో మంగళవారం ధర్నాకు దిగారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, దేశమొల్ల ఆంజనేయులు, బీజేపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, అనంత్‌రెడ్డి, వైభవ్‌రెడ్డి, సీపీఐకి చెందిన కె.రామస్వామి సత్తిరెడ్డి, సీపీఎంకు చెందిన దేవేందర్, కాంగ్రెస్ పార్టీకి చెందిన శైలజ, సమత, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు కార్యకర్తలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిత్యం ప్రమాదాలతో ప్రాణాలు పోతున్నా కోర్టు కేసులు అంటూ జాప్యం చేస్తారా అంటూ నిలదీశారు. ఎన్‌జీటీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే కేసు వాపస్ తీసుకోవాలని డిమాండ్ చేశారు. రహదారి విస్తరణ పనులు వెంటనే చేపట్టాలని, దీనిపై మంత్రులు కానీ అధికారులు కానీ వచ్చి సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న ఆర్డీఓ చంద్రకళ అక్కడికి చేరుకున్నారు. రోడ్డు పనులకు సంబంధించి టెండర్లు, భూసేకరణ, పరిహారం పంపిణీ పనులు దాదాపు పూర్తయ్యాయని, రోడ్డు నిర్మాణం పూర్తి చేసేందుకు అన్ని అనుమతులు తీసుకున్నట్లు చెప్పారు. గ్రీన్ ట్రిబ్యూనల్‌లో తేజ అనే వ్యక్తి కేసు వేయడంతో ఆలస్యమైందన్నారు. దీనిపై నేషనల్ హైవే అధికారులు కూడా అప్పీల్ చేశారని ఈనెల 16న కేసు వాయిదా ఉందని తెలిపారు. రోడ్డు పనులు ప్రారంభించి త్వరగా పూర్తయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం అఖిలపక్ష నేతలు గ్రీన్‌ట్రిబ్యూనల్‌లో కేసు వేసిన తేజపై చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో సీఐ భూపాల్ శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. చేవెళ్ల ఏసీపీ కిషన్, నార్సింగ్ ఏసీపీ రమణగౌడ్ ఆధ్వర్యంలో సిబ్బంది మోహరించారు.



చేవెళ్లలో ధర్నాకు దిగిన అఖిలపక్షం నాయకులు, మోహరించిన పోలీసులు

**ఆలూరు బస్‌స్టేజీ వద్ద ఆందోళన**

లారీ ప్రమాదం చోటు చేసుకున్న ఆలూరు బస్‌స్టేజీ వద్ద గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ధర్నాకు దిగారు. చేవెళ్ల వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. వీరికి బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభ్రప్రద్ పటేల్ మద్దతు తెలిపారు. ఆర్డీఓ చంద్రకళ వారిని సైతం సముదాయించి పంపించారు.

## క్లుప్తంగా

### బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

యాలాల: అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందిన ఉపాధ్యాయురాలి కుటుంబానికి పీఆర్‌టీయూ సంఘం తరపున రూ.లక్ష పాలసీ డబ్బును మంగళవారం అందించారు. మండల పరిధిలోని బెన్నూరు పాఠశాలలో ఇంగ్లిషు ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న సవితా గత నెలలో మృతి చెందింది. పీఆర్‌టీయూ సంఘంలో క్రియాశీలక సభ్యత్వం కలిగిన ఆమెకు సంఘం తరపున కట్టిన పాలసీ క్లైయిమ్ అయింది. ఈ మేరకు రూ.లక్ష చెక్కును సంఘం జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్, గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి ఆమె కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, రాములు పాల్గొన్నారు.

### చిరస్థాయిగా నిలిచేవి సేవలే



హోంగార్డును సన్మానించిన ఎస్పీ

అనంతగిరి: విధి నిర్వహణలో ప్రజలకు మనం చేసిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయిని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం దీర్ఘకాలంగా హోంగార్డుగా సేవలు అందించిన సత్యయ్య పదవీ విరమణ సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో ఆయన్ని ఘనంగా సత్కరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసుశాఖలో సేవ చేసి అందరి మన్ననలు పొందడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో హోంగార్డుల సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ చాంద్‌పాషా పాల్గొన్నారు.

### దివ్యాంగులపై చిన్నచూపు వద్దు

న్యాయమూర్తి డీబీ శీతల్



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి

అనంతగిరి: మానసిక వైకల్యం ఉన్న వారి పట్ల చిన్న చూపు చూపొద్దని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్ సూచించారు. ఈ మేరకు మంగళవారం దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో వికారాబాద్‌లోని భవిత సెంటర్‌లో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా సెంటర్‌లో ఉన్న దివ్యాంగులందరికీ ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమానికి న్యాయమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ వెంకటరవణ, చీఫ్ డిఫెన్స్ కౌన్సిలర్ వెంకటేశ్, రాము, శ్రీనివాస్, ఎంఈఓ బాబుసింగ్, ప్యానల్ అడ్వకేట్ శంకరయ్య, వైద్యులు పాల్గొన్నారు.

### టెన్నిస్‌లో మోమిన్‌పేట బాలిక ప్రతిభ



ప్రశంసాపత్రం అందిస్తున్న నిర్వాహకులు

మోమిన్‌పేట: మోమిన్‌పేట గ్రామానికి చెందిన మోటాటి అక్షయరెడ్డి అండర్–14లో టెన్నిస్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. జాతీయ జట్టుకు అక్షయరెడ్డి కెప్టెన్‌గా వ్యవహరించనుందని తండ్రి నరేందర్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన మోటాటి నరేందర్ రెడ్డి, మాధవి దంపతుల కూతురు అక్షయరెడ్డి టెన్నిస్‌లో ప్రథమ స్థానం కైవసం చేసుకోవడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని విష్ణ ఇంటర్నేషనల్ స్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతుందని తెలిపారు.



# మారని తండ్లాట!

- సమస్యలతో సతమవుతున్న గిర్కబాయి తండా వాసులు
- వాహన రాకపోకలు లేని ఏకైక తండా
- నేటికీ కాలినడకే శరణ్యం
- అంగన్‌వాడీ లేదు.. ఆరోగ్యసేవలు అందవు



వాగు దాటేందుకు ఇబ్బంది పడుతున్న తండావాసులు

బొంరాస్‌పేట: జిల్లాలో వాహనరాకపోకలు లేని ఏకైక తండా.. తరాలు మారుతున్న.. తండాకు మాత్రం రోడ్డు సౌకర్యం లేదు. ఆధునికంలోనూ ఆటవిక జీవనం గడుపుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్యసేవలు ఉండవు.. పక్కనే ఉన్న మూడు మామిళ్లతండాకు బీటీరోడ్డు, డీప్లానాయక్‌తండాలకు బీటీ రోడ్డు నిర్మిస్తున్న పాలకులకు మట్టి రోడ్డు కూడా లేని తమ తండా కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**47 పంచాయతీల్లో 22 తండాలు**

వికారాబాద్ జిల్లాలో అత్యధికంగా గిరిజన నివాస ప్రాంతాలున్నవి బొంరాస్‌పేట మండలంలోనే. ఈ మండలంలో 47 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో 22 గిరిజన పంచాయతీలున్నాయి. వీటిలో నేటికీ వాహన సౌకర్యం లేని, రాకపోకలు లేని ఏకైక గిరిజన నివాస ప్రాంతం బాపన్‌చెర్వుతండా గ్రామపంచాయతీలోని గిర్కబావితండా. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు కొంత మంది గిరిజనలకు అందని ద్రాక్షగానే ఉన్నాయి.

**నూరేళ్ల క్రితం ఏర్పడిన తండా**

నూరేళ్ల క్రితం ఏర్పడిన ఈ గిర్కబావితండాలో 25 కుటుంబాలున్నాయి. తండా మొట్టమొదటి వ్యక్తిగా హేమ్లానాయక్, గూని లక్ష్మమ్మ దంపతుల తండాగా ఏర్పడింది. ప్రస్తుతం తండాలో 135 మంది జనాభా వుంది. ఆసరా పెన్షన్లు, మిషన్ భగీరథ నీరు, విద్యుత్ సౌకర్యం, రైతుబంధు పథకం మినహాయిస్తే వీరి అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సౌకర్యాలు అందలేదన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ప్రజల వద్దకు పాలన వంటి పథకాలు కూడా వీడి దరిచేరలేదు. ప్రభుత్వాలు మారుతున్నా గిరిజనం దుస్థితి ఏమాత్రం మారలేదని వాపోతున్నారు. రోడ్డు సౌకర్యం కూడా లేనందున వృద్ధులు అనారోగ్యానికి గురైతే నానా ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు సౌకర్యం కోసం ఎమ్మెల్యేకు విన్నవిస్తే సానుకూలంగా స్పందించారని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు విద్యావంతులు ప్రజాసంఘాల నాయకులు పట్టించుకుని తమ తండా సమస్యలు తీర్చాలని, తండాను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

**తండా సమస్యలు**

- జాతీయ రహదారి 163కు 1.5కిలోమీటర్ల దూరం ఉన్న తండాకు రోడ్డు సౌకర్యం లేదు. వర్షాకాలం వచ్చిందంటే కాలినడకన కూడా వెళ్లలేని దుస్థితి
- వారానికి ఒక సారి నీటి సరఫరా
- అంగన్‌వాడీ కేంద్రం లేనందుకు చిన్నారులు పోషకాహారానికి, చదువుకు దూరం.
- కిశోర బాలికలు నేటికీ నిరక్షరాస్యులే. కుటుంబ సభ్యులతో కలిసి పూణె, హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లి వలస కూలీలుగా మారుతున్నారు.
- యువత చదువుకు దూరం. ఆసక్తి ఉన్నా దూర ప్రాంతాలకు వెళ్లేందుకు రోడ్డు మార్గం లేక మానేశామని వెల్లడి.
- సీఎంఆర్ఎఫ్ వంటి ప్రభుత్వ పథకాలకు అర్హులున్నా లబ్ధి చేకూరడం లేదంటున్నారు.

| | |
|---|---|
| వలస కుటుంబాలు: | 15 |
| పెన్షన్‌కు అర్హులు: | 06 |
| బాలకార్మికులు : | 26 |

**‘చేయూత’ లేదు**



దృష్టి, వినికిడి లోపం, అంగవైకల్యం ఉన్న చిన్నారులు, యువకులు, వయోజనులున్నారు. నడవలేని వృద్ధులు చేయూత పెన్షన్‌కు ఆరుగురు అర్హులున్నారు. అధికారులు స్పందించి అందేలా చూడాలి.

– లాలిబాయి, దివ్యాంగురాలు

**మినీ అంగన్‌వాడీ ఏర్పాటు చేయాలి**



మినీ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని దరఖాస్తు చేశాం. సీడీపీఓకు విన్నవించాం. ఎలాంటి పరిష్కారం లభించలేదు. తండా వాసి కూతురు పెళ్లికి కల్యాణ లక్ష్మి పథకం సైతం అందలేదు.

– రవి, తండావాసి

**రోడ్డు వేయడం లేదు**



మా తండాకు రోడ్డు లేదు. రేగడిమైలారం నుంచి మొగుళ్లబావి పానిది నుంచి తండా దారిలో రెండు వాగులు, మందమైసమ్మ నుంచి ఉన్న దారిలో ఒక వాగు ఉన్నాయి. అటవి ప్రాంతం కావడంతో రోడ్డు వేయడం లేదు. సమస్యలు పరిష్కరించే వారే కరువయ్యారు.

– ముత్యాలమ్మ, తండాపెద్ద

## వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

సోదరుడి ప్రేమ వ్యవహారమే కారణమంటూ ఆరోపణ



సాయమ్మ (ఫైల్)

ధారూరు: వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని కుమ్మర్‌పల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సాయమ్మ(45)ను పరిగి మండలం నస్కల్ గ్రామానికి చెందిన అంజయ్యతో గతంలో వివాహం చేశారు. కాగా 18 ఏళ్ల క్రితం భర్తను వదిలివేసి తల్లిగారింట్లో సాయమ్మ ఉంటుంది. గతేడాది నుంచి ఆమె వికారాబాద్‌లో అద్దెకు గది తీసుకుని కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఇటీవల ఆమె తమ్ముడు ఆనంద్ గ్రామానికి చెందిన ఓ అమ్మాయిని తీసుకెళ్లినట్లు వికారాబాద్ పోలీసులకు ఫిర్యాదు అందింది. తమ్ముడి విషయం అక్కకు తెలుసని అమ్మాయి కుటుంబీకులు, పోలీసులు సాయమ్మను ప్రశ్నిస్తూ వచ్చారు. వారి వేధింపులు తాళలేక ఆమె కుమ్మర్‌పల్లికి వచ్చి ‘నేను చస్తా, తమ్ముడు తీసుకెళ్లిన అమ్మాయి విషయంలో వారి కుటుంబీకులు, పోలీసులు వేధిస్తున్నా’రని తల్లితో వాపోయింది. ఈ క్రమంలో గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మరో సోదరుడు అశోక్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు.

# పొలాల మధ్య డంపింగ్‌యార్డు వద్దు



ఆందోళన చేస్తున్న రైతులు

- రంగాపూర్ శివారులో రైతుల ఆందోళన
- నిరసనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



ఆందోళన చేస్తున్న మహిళా రైతులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

పరిగి: పొలాల మధ్య డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయొద్దని రైతులు ఆందోళన బాట పట్టారు. మంగళవారం పరిగి పట్టణ శివారులోని రంగాపూర్ సమీపంలో డంపింగ్‌యార్డు శంకుస్థాపనకు అధికారులు ఏర్పాట్లు చేస్తుండగా స్థానిక రైతులు దీన్ని వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టారు. పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళన చేస్తున్న రైతులను అదుపులోని తీసుకొని ఠాణాకు తరలించారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. మండల పరిధిలోని రంగాపూర్ గ్రామ శివారులో మధారం గ్రామ రెవెన్యూ పరిధిలోని 288 సర్వే నంబర్‌లో ఎకరం, రంగాపూర్ రెవెన్యూ పరిధిలోని 50 సర్వేనంబర్‌లో 20 గంటల భూమిని డంపింగ్ యార్డు ఏర్పాటుకు కేటాయించారు. దీంతో ఇరు గ్రామాల రైతులు డంపింగ్ యార్డు ఏర్పాటు చేయవద్దని ఆందోళన చేపట్టారు. గతంలో కూడా డంపింగ్‌యార్డు ఏర్పాటు చేస్తే వద్దని ఆందోళన చేశామని గుర్తు చేశారు. డంపింగ్ యార్డు ఏర్పాటుతో రైతులు, గ్రామస్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని వాపోయారు. పరిగిలో సేకరించిన చెత్త చెదారాన్ని ఇక్కడ పొలాల మధ్య వేయడంతో పంటలకు తీవ్ర నష్టంతో పాటు రైతుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఎమ్మెల్యే పర్యటన రద్దు**

డంపింగ్ యార్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి హాజరు కావాల్సి ఉండగా రైతుల ఆందోళనతో కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. నిరసన చేపడుతున్న రైతులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి, కొద్ది సేపటికి వదిలివేశారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అధికారులతో మాట్లాడి డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయరాదని సూచించారు. ఈ క్రమంలో కొంతసేపు రంగాపూర్ శివారులో ఉద్రిక్త వాతావరణ పరిస్థితి నెలకొంది. పోలీసుల భారీ బందోబస్తు నడుమ అధికారులు డంపింగ్‌యార్డు శంకుస్థాపన కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

# డీసీసీబీకి పక్కా భవనం



రెవెన్యూ అధికారుల నుంచి పత్రాలు అందుకుంటున్న డీసీసీబీ చైర్మన్, సీఈఓ

స్థలం కేటాయించిన రెవెన్యూ అధికారులు

కొడంగల్: పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ పాత కార్యాలయం ఆవరణలో డీసీసీబీ(జిల్లా సహకార కేంద్ర బ్యాంకు) కొడంగల్ బ్రాంచ్‌కు పక్కా భవనం నిర్మించనున్నారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు 250 గజాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. సుమారు రూ.70లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ బ్యాంకు సీఈఓ పురుషోత్తంరావు దేశ్‌పాండే తెలిపారు. కొడంగల్ రెవెన్యూ అధికారుల నుంచి స్థలానికి సంబంధించిన పత్రాలను అందుకున్నట్లు చెప్పారు. స్థలాన్ని స్వాధీనం చేసుకొని త్వరలో భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. కొడంగల్‌లో ఇప్పటి వరకు ఉన్న బ్యాంకు కార్యాలయం గత ఐదు దశాబ్దాలుగా అద్దె భవనంలో కొనసాగుతోంది. బ్యాంకు సిబ్బందికి ఖాతాదారులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు లేకపోవడంతో ప్రస్తుత డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి చొరవ తీసుకొని సీఎం రేవంత్ రెడ్డి, కొడంగల్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వారి అనుమతితో కొడంగల్‌లోని గ్రామీణ నీటి పారుదల శాఖ కార్యాలయం ఆవరణలో 250 గజాల స్థలం కేటాయించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, బ్యాంక్ సీఈఓ పురుషోత్తం రావు దేశ్‌పాండే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఏటీఎంలో చోరీకి యత్నం



కరన్‌కోట్ ఏటీఎంలో చోరీకి యత్నిస్తున్న దొంగ

తాండూరు రూరల్: ఏటీఎంలో నగదు చోరీ చేసేందుకు దొంగ యత్నించాడు. ఈ సంఘటన మండల పరిధిలోని కరన్‌కోట్ గ్రామంలో చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు మండలం కరన్‌కోట్ గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో ఎస్‌బీఐ ఏటీఎం ఉంది. సోమవారం అర్ధరాత్రి ఇద్దరు దుండగులు ముఖానికి మాస్క్ ధరించి ఏటీఎంలోకి చొరబడి గడ్డపారతో ఏటీఎంను తవ్వేందుకు అందులో ఉన్న విద్యుత్ కనెక్షన్ తొలగించారు. వెంటనే అక్కడ కరెంట్ పోవడంతో అలారం మోగింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఏటీఎం వద్ద చేరుకునే లోపు ఆ దొంగలు పారిపోయారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ ఏటీఎంలో నగదు చోరీ కాలేదని నిర్ధారణకు వచ్చారు. చోరీ సంఘటనకు సంబంధించిన వీడియో సీసీ కెమెరాలో నమోదయింది. దీంతో పోలీసులు దొంగలను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## అరటి కాయ గొంతులో ఇరుక్కుని వ్యక్తి మృతి



బాల్‌రాజ్ మృతదేహం

కొందుర్గు: అరటికాయ గొంతులో ఇరుక్కుని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం తంగెళ్లపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెక్కల బాల్‌రాజ్(55) వ్యవసాయం, కూలీ పనులు చేస్తుంటాడు. మంగళవారం పొలంలో కాసిన అరటి కాయను తింటుండగా గొంతులో ఇరుక్కుని, శ్వాస తీసుకోవడానికి ఇబ్బందిగా మారింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గంమధ్యలో చనిపోయాడు. మృతుడికి భార్య నీలమ్మతోపాటు, ఓ కుమారుడు, కూతురు ఉన్నారు. బాల్‌రాజ్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

## చికిత్స పొందుతున్న మహిళ ఆత్మహత్య

బొంరాస్‌పేట: చికిత్స పొందుతూ ఓ వివాహిత మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మదన్‌పల్లితండాలో చోటుచేసుకుంది. ఎస్సై ఎండీ రవూఫ్ వివరాల మేరకు.. మదన్‌పల్లితండాకు చెందిన ఆంగోతు అమినానాయక్ భార్య ఆంగోతు లాలిబాయి(37)కు చెప్పి గత శుక్రవారం పరిగి మార్కెట్‌కు వరి ధాన్యం అమ్మడానికి వెళ్లాడు. ధాన్యం కొనుగోళ్లు ఆలస్యంకావడంతో రాత్రికి అక్కడే ఉన్నాడు. దీంతో తన భర్త అక్రమ సంబంధంతోనే ఇంటికి రాలేదని అనుమానించింది. గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. చికిత్స కోసం తాండూరు, అక్కడి నుంచి వికారాబాద్, హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. మంగళవారం అంత్యక్రియలు చేశారు. ఐదుగురు సంతానం ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ప్రైవేటు స్కూల్ బస్సులో షార్ట్ సర్క్యూట్

పరిగి: పాఠశాల నుంచి విద్యార్థులను తీసుకుని ఇంటికి వెళ్తున్న ప్రైవేటు స్కూల్ బస్సులో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి పొగ వ్యాపించింది. అప్రమత్తమైన బస్సు డ్రైవర్ బస్సును ఆపి విద్యార్థులను కిందికి దించి వేయడంతో పెను ప్రమాదం తప్పింది. పట్టణ కేంద్రంలోని భృంగి ప్రైవేటు స్కూల్ విద్యార్థులను బస్సులో ఎక్కించుకుని మంగళవారం సాయంత్రం పాఠశాల నుంచి పట్టణ కేంద్రానికి బయలు దేరింది. కోర్టు సమీపానికి చేరుకోగానే బస్సులో నుంచి పొగలు రావడాన్ని గమనించిన డ్రైవర్ వెంటనే బస్సును ఆపి విద్యార్థులను కిందికి దింపేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. రోడ్డుపై నుంచి బస్సును ఓ పక్కకు ఉంచి పరీక్షించారు. బస్సులో పొగలు షార్ట్‌సర్క్యూట్‌తో వచ్చాయా? ఎలా వచ్చాయని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాలం చెల్లిన బస్సులను నడపడంతోనే ఇలా జరిగి ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని..

అబ్దుల్లాపూర్‌మెట్: ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బాటసింగారం ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై మంగళవారం ఉదయం ఓ గుర్తు తెలియని వ్యక్తి (30–35)కి ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

# ప్లాస్టిక్‌తో పర్యావరణానికి హాని



బయోప్లాస్టిక్ కవర్లను ప్రదర్శిస్తున్న నాయకులు, నిర్వాహకులు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు

కుల్కచర్ల: ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా నడుచుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో కాలుష్య రహిత ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు వాడే ప్లాస్టిక్ కారణంగా జీవరాశికి ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ప్లాస్టిక్ భూమిలో కలవకపోవడంతో పర్యావరణం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. భూమిలో కలిసిపోయే ప్లాస్టిక్ కాగితాలను ఉపయోగించడంతో పర్యావరణానికి హాని కలగదన్నారు. ప్రజలందరూ సమాజానికి ఉపయోగపడే బయో ప్లాస్టిక్ కవర్లను వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో బయో ప్లాస్టిక్ సంస్థ నిర్వాహకులు సాయిభరత్, బీజేపీ నేతలు ఆంజనేయులు, బందయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు, రామాంజనేయులు, ఉత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

# పదుల సంఖ్యలో కాకుల మృతి

- భయాందోళనలో గురుదోట్ల గ్రామస్తులు
- విచారణ జరపాలని పశుసంవర్ధకశాఖకు విజ్ఞప్తి



మైసమ్మ గుడి వద్ద మృతి చెందిన కాకులు

ధారూరు: పదుల సంఖ్యలో కాకుల మృతి చెందడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. ఈ సంఘటన మండల పరిధిలోని గురుదోట్ల గ్రామంలో మంగళవారం చోటుచేసుకంది. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో ఉదయం మైసమ్మ గుడి వద్ద కొన్ని కాకులు మృతి చెందటాన్ని గ్రామస్తులు గమనించారు. అలాగే గ్రామ పరిసరాల్లో పదుల సంఖ్యలో కాకులు విగతజీవిగా పడి ఉండడంతో స్థానికులు భయాందోళన చెందారు. ఇవి సహజంగా మృతి చెందాయా.. ఎవరైనా విష పదార్థాలు పెట్టారా అని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. దీనిపై విచారణ జరపాలని పశుసంవర్ధకశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. గతంలో ఇదే మండలంలోని దోర్నాల్ గ్రామంలో కాకులు వందల సంఖ్యలో మృతి చెందగా పశుసంవర్ధకశాఖ అధికారులు గ్రామానికి వెళ్లి శ్యాంపుల్స్ సేకరించి, రిపోర్టును బహిర్గతం చేయలేదు. దీంతో ప్రజల్లో నెలకొన్న భయాందోళన తీరలేదు. ఈ క్రమంలో గురుదోట్లవాసులు కాకల మృతిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కోరుతున్నారు.

# ఎర్రమట్టి అక్రమ తవ్వకాలపై విచారణ

**ఎంక్వైరీ ఆఫీసర్‌గా నల్లగొండ ఏఎస్పీ రాములునాయక్**

- ఆర్కతల, యావాపూర్, చిట్టిగిద్ద గ్రామాల్లో పర్యటన
- మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల విచారణ
- ఐజీ సత్యనారాయణ ఆదేశాల మేరకు విచారణ చేస్తున్నామని వెల్లడి



నవాబుపేట పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఏఎస్పీ రాములునాయక్

నవాబుపేట: ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించినా, కబ్జా చేసినా, ధ్వంసం చేసినా కఠిన చర్యలు తప్పవని నల్లగొండ అడిషనల్ ఎస్పీ రాములునాయక్ అన్నారు. మండల పరిధిలోని ఆర్కతల, యావాపూర్, చిట్టిగిద్ద గ్రామాల ప్రభుత్వ భూముల్లో ఎర్ర మట్టి అక్రమ తరలింపుపై నల్లగొండ ఏఎస్పీ రాములు నాయక్ విచారణ చేపట్టారు. మిర్యాలగూడ సీఐ నాగరాజుతో కలిసి మంగళవారం ఆయా గ్రామాల్లో పర్యటించారు. అనంతరం నవాబుపేట పంచాయతీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఐజీ సత్యనారాయణ ఆదేశాల మేరకు వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలోని ప్రభుత్వ భూములు, గుట్టల్లో జరుగుతున్న ఎర్ర మట్టి అక్రమ రవాణాపై క్షేత్ర స్థాయిలో విచారణ చేశామన్నారు. ఇటీవల నవాబుపేట పీఎస్‌ను సందర్శించిన ఐజీకి ఎర్ర మట్టి అక్రమ రవాణాపై సమాచారం అందిందని తెలిపారు. ఈ అంశంలో తనను ఎంక్వైరీ అధికారిగా ఇక్కడికి పంపించారన్నారు. ఈ మేరకు ఆర్కతల, యావాపూర్, చిట్టిగిద్ద గ్రామాల్లోని తవ్వకాలు జరిపిన ప్రాంతాల్లో పర్యటించామని, పంచాయతీ కార్యదర్శులు, మాజీ సర్పంచులు, బాధితులను పిలిచి విచారణ చేశామని వెల్లడించారు. వారి వివరాలను రికార్డు చేశామని స్పష్టంచేశారు. తవ్వకాలు చేపట్టిన స్థలం ప్రభుత్వానిదా..? ప్రైవేటు వ్యక్తులదా..? అనే విషయాలపై మైనింగ్ శాఖ అధికారులను సైతం విచారించామన్నారు. చెరువుల్లో జరిగిన మైనింగ్‌పై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను సైతం ప్రశ్నించినట్లు చెప్పారు. మైనింగ్‌పై విచారణ కొనసాగుతోందని, పూర్తయిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. ఈ విషయంలో మీడియా ప్రతినిధులు సైతం తమకు సహకరించి, తెలిసిన సమాచారం ఇవ్వాలని కోరారు. మండలంలోని వట్టిమీనపల్లి, పులుమామిడి, మాదిరెడ్డిపల్లి, గేట్‌వనంపల్లి, ఎల్లకొండతో పాటు మోమిన్‌పేట మండలంలో సైతం ఎర్రమట్టి అక్రమ తరలింపుపై ఫిర్యాదు వచ్చాయన్నారు. ఆయా గ్రామాల్లోనూ విచారణ చేపట్టిన, ఉన్నతాధికారులకు తుది నివేదిక అందజేస్తామని స్పష్టంచేశారు.